జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
మహబూబ్‌నగర్
నాగర్ కర్నూల్, వనపర్తి
జోగులాంబ గద్వాల
నారాయణపేట
శనివారం 21 నవంబర్ 2026 పేజీలు:11



అన్న దాత రఘు స్వామికి ఆంజనేయ స్వాముల సన్మానం

నాగర్ కర్నూల్ నవంబర్ 20 ప్రజా జ్యోతి బ్యూరో)

హనుమాన్ మాలాధారణ చేపట్టిన స్వాములకు గత కొన్ని రోజులుగా మధ్యాహ్న వేళ అన్నదానం నిర్వహిస్తున్న దాత రఘు స్వామిని శుక్రవారం ఆంజనేయ స్వాములు ఘనంగా సత్కరించారు.అచ్చంపేటకు చెందిన రఘు స్వామి హనుమాన్ మాలధారులకు భిక్ష ఏర్పాటు చేస్తూ తన భక్తిభావాన్ని చాటుకుంటున్నారు.

మిగతా 2 లో

ఎర్రవల్లి భూముల జోలికొస్తే ఊరుకునేది లేదు



- డిండి ఎత్తిపోతల పథకాన్ని రద్దు చేయాలి..

ఎర్రవల్లి, ఎర్రవల్లి తండాలను ముంపు నుంచి కాపాడాలి...- కల్వకుర్తి ఆర్డీవో కార్యాలయానికి పాదయాత్రగా వెళ్లి వినతిపత్రం అందజేసిన గ్రామస్తులు...- నిర్వాసితులకు అండగా ఉంటాం.. జేఏసీ నాయకులు

కల్వకుర్తి నవంబర్ 20 ప్రజా జ్యోతి):

డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా ప్రతిపాదించిన ఎర్రవల్లి--గోకారం రిజర్వాయర్ నిర్మాణంతో ముంపు ముప్పు ఎదుర్కొంటున్న ఎర్రవల్లి, ఎర్రవల్లి తండా గ్రామాలను, రైతుల వ్యవసాయ భూములను కాపాడే వరకు నిర్వాసితులకు అండగా నిలుస్తామని కల్వకుర్తి జేఏసీ నాయకులు స్పష్టం చేశారు. పాలమూరు ప్రాంత నీటి హక్కులను, రైతుల భూములను పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ బాధిత గ్రామాల ప్రజలు గురువారం ఎర్రవల్లి గ్రామం నుంచి కల్వకుర్తి ఆర్డీవో కార్యాలయం వరకు పాదయాత్ర చేపట్టారు.

మిగతా 2 లో



పాలమూరు యూనివర్సిటీ అభివృద్ధికి రూ.1,000 కోట్లు కేటాయించాలి



- విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చొరవ చూపాలి
- స్వేరో రాష్ట్ర అధ్యక్షుడు మొగిలిపాక నవీన్ కుమార్

మహబూబ్‌నగర్, నవంబర్ 20 (ప్రజా జ్యోతి బ్యూరో):

పాలమూరు యూనివర్సిటీ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.1,000 కోట్ల ప్రత్యేక నిధులు కేటాయించాలని, విశ్వవిద్యాలయ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సైతం ప్రత్యేక చొరవ తీసుకోవాలని స్వేరో స్టూడెంట్స్ యూనియన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మొగిలిపాక నవీన్ కుమార్ డిమాండ్ చేశారు.విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం విద్యార్థి సంఘాలకు అతీతంగా అందరూ ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

మిగతా 2 లో

ఎర్రవల్లి భూముల జోలికొస్తే ఊరుకునేది లేదు

మొదటిపేజీ తరువాయి

పాదయాత్రగా కల్వకుర్తికి చేరుకున్న గ్రామస్తులు మహబూబ్‌నగర్ చౌరస్తాలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయానికి చేరుకుని తమ సమస్యలను వివరిస్తూ అధికారులకు వినతిపత్రం అందజేశారు. గ్రామాలను, వ్యవసాయ భూములను ముంపు నుంచి కాపాడాలని, డిండి ఎత్తిపోతల పథకాన్ని రద్దు చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. బాధిత గ్రామాల ప్రజలు గత ఎనిమిదేళ్లుగా తమ గ్రామాల ఉనికి, వ్యవసాయ భూముల పరిరక్షణ కోసం పోరాటం చేస్తున్నారని తెలిపారు. తమ నిరసనలో భాగంగా స్థానిక సంస్థల సర్పంచ్ ఎన్నికలను సైతం బహిష్కరించారని పేర్కొన్నారు. గత 11 నెలలుగా శాంతియుతంగా కొనసాగిస్తున్న సామూహిక నిరాహార దీక్షలు నేటికి 354వ రోజుకు చేరుకున్నాయని వెల్లడించారు. చిన్న, సన్నకారు రైతులైన గ్రామస్తులు వ్యవసాయ భూములపైనే ఆధారపడి జీవిస్తున్నారని, రిజర్వాయర్ నిర్మాణం జరిగితే తమ జీవనాధారమైన భూములను కోల్పోయి పూర్తిగా నిర్వాసితులయ్యే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల ఉనికికే ప్రమాదం కలిగించే నిర్ణయాలను ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమస్య పరిష్కారానికి కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి నిర్వాసితులకు స్పష్టమైన హామీ ఇచ్చారని జేఏసీ నాయకులు గుర్తుచేశారు. అయితే ఇటీవల వెల్దండ తహసీల్దార్ ఎర్రవల్లి గ్రామపంచాయతీకి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అమలు చేస్తామని చెప్పడంతో గ్రామస్తుల్లో మరింత ఆందోళన నెలకొందన్నారు. గ్రామాలను ముంపునకు గురిచేసే చర్యలు చేపట్టకుండా ఆర్‌అండ్‌ఆర్ ప్రాథమిక నోటిఫికేషన్‌ను వెంటనే రద్దు చేయాలని కోరారు. పాలమూరు ప్రాంతానికి నష్టం కలిగించే డిండి ఎత్తిపోతల పథకానికి బదులుగా బస్వాపూర్, పుట్టంగండి, ఎస్ఎల్‌బీసీ వంటి ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా నీటిని తరలించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలించాలని సూచించారు. ఎర్రవల్లి, ఎర్రవల్లి తండా గ్రామాలను, రైతుల వ్యవసాయ భూములను ముంపు ముప్పు నుంచి కాపాడి బాధితులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

జేఏసీ ప్రధాన డిమాండ్లు:

– డిండి ఎత్తిపోతల పథకాన్ని రద్దు చేసి ఎర్రవల్లి, ఎర్రవల్లి తండా గ్రామాలను ముంపు నుంచి కాపాడాలి. – పాత గోకారం చెరువును యథావిధిగా పునర్నిర్మించాలి. – ఆర్‌అండ్‌ఆర్ ప్రాథమిక నోటిఫికేషన్‌ను వెంటనే రద్దు చేయాలి. – రైతుల వ్యవసాయ భూములకు, గ్రామాల ఉనికికి రక్షణ కల్పించాలి. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి జేఏసీ నాయకులు సదానందం గౌడ్, చీమల అర్జున్ రెడ్డి, జంగయ్య, ప్రకాష్, పెద్దగౌడ్, నాగయ్య, పర్వతాలు గౌడ్, శేఖర్‌తో పాటు ఎర్రవల్లి గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామాల పరిరక్షణ





కోసం తమ పోరాటాన్ని శాంతియుతంగా, ఐక్యంగా కొనసాగిస్తామని ఈ సందర్భంగా జేఏసీ నాయకులు స్పష్టం చేశారు.

పాలమూరు యూనివర్సిటీ అభివృద్ధికి రూ.1,000 కోట్లు కేటాయించాలి

మొదటిపేజీ తరువాయి

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాలమూరు యూనివర్సిటీలో విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వం మరింత దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. హాస్టల్ భవనాల నిర్మాణం, ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ పోస్టుల భర్తీ, ఆధునిక లైబ్రరీల ఏర్పాటు, పీహెచ్‌డీ విద్యార్థులకు ఫెలోషిప్‌లు, లా కళాశాల ఏర్పాటు, ఎంబీఏ విద్యార్థులకు ప్రత్యేక హాస్టల్ సదుపాయాలు వంటి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. యూనివర్సిటీలో నూతన కోర్సులను ప్రవేశపెట్టి, విద్యార్థులకు విస్తృతమైన విద్యా అవకాశాలు కల్పించాలని సూచించారు. విదేశీ విశ్వవిద్యాలయాలతో విద్యా ఒప్పందాలు కుదుర్చుకోవడం, పరిశోధనలకు ప్రోత్సాహం అందించడం, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం ద్వారా విద్యార్థులకు మెరుగైన భవిష్యత్తు, ఉద్యోగ అవకాశాలు కల్పించవచ్చన్నారు. విద్యార్థుల హక్కులు, సమస్యల పరిష్కారం కోసం స్వేరో స్టూడెంట్స్ యూనియన్ నిరంతరం పోరాటం చేస్తుందని తెలిపారు. విద్యార్థి సంఘాల మధ్య ఉన్న భేదాభిప్రాయాలను పక్కనపెట్టి, యూనివర్సిటీ అభివృద్ధి అనే ఉమ్మడి లక్ష్యంతో ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. పాలమూరు యూనివర్సిటీని జాతీయ స్థాయిలో అత్యుత్తమ విద్యాసంస్థగా తీర్చిదిద్దేందుకు ప్రతి విద్యార్థి భాగస్వామి కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి స్వేరో స్టూడెంట్స్ యూనియన్ పాలమూరు యూనివర్సిటీ అధ్యక్షుడు పవన్ కుమార్ బాధ్యత వహించగా, స్వేరో ఎస్ఎస్‌యూ ముఖ్య నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ప్రత్యేక అతిథిగా పాలమూరు యూనివర్సిటీ జేఏసీ చైర్మన్ పోలె నరేందర్ హాజరయ్యారు.



అన్న దాత రఘు స్వామికి ఆంజనేయ స్వాముల సన్మానం

మొదటిపేజీ తరువాయి

రామాంజనేయ సేవా సమితి జిల్లా అధ్యక్షుడు బాలరాం గురుస్వామి ఆధ్వర్యంలో భిక్ష కార్యక్రమంకొనసాగుతుండగా, అన్నదానానికి రఘు స్వామి పూర్తి సహకారం అందిస్తున్నారు. మాలధారణ పూర్తయ్యే వరకు తన వంతుగా మధ్యాహ్న వేళ అన్నదాన సేవ చేసే అవకాశం లభించడం తన అదృష్టంగాభావిస్తున్నానని రఘు స్వామి తెలిపారు. ఆంజనేయ స్వాములకు సేవ చేయడం ఎంతో సంతృప్తినిస్తోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రఘు స్వామి అందిస్తున్న సేవలను ఆంజనేయ స్వాములుకొనియాడుతూ ఆయనను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పలువురు హనుమాన్ మాలధారణ స్వాములు పాల్గొన్నారు.

సంపత్ కుమార్ జన్మదినం సందర్భంగా మెగా రక్తదాన శిబిరం

- ఎర్రవల్లి మండల అధ్యక్షుడు నర్సి రెడ్డి ఆధ్వర్యంలో

- 14వ సారి రక్తదానం చేసిన సోషల్ మీడియా జిల్లా కోఆర్డినేటర్ సంధ్య బాబు

ఇటిక్యాల,ఎర్రవల్లి (ప్రజా జ్యోతి) నవంబర్ 20:



అలంపూర్ మాజీ ఎమ్మెల్యే ఏఐసీసీ కార్యదర్శి డాక్టర్ ఎస్.ఏ.సంపత్ కుమార్ జన్మదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం ఎర్రవల్లి మండల కేంద్రంలో మెగా రక్తదాన శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు.ఎర్రవల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు టీ.నర్సిరెడ్డి ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని గద్వాల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి మెడికల్ ఆఫీసర్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది రక్తదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.అన్ని దానాలకంటే రక్తదానం ఎంతో గొప్పదని ఆపదలో ఉన్నవారి ప్రాణాలను కాపాడేందుకు రక్తదానం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు.జన్మదిన సందర్భంగా పండ్లు,పలహారాలు, ఆహార పదార్థాలు పంపిణీ చేశారు.పాటు రక్తదాన శిబిరాలు నిర్వహించడం కూడా ఎంతో అభినందనీయమన్నారు.రక్తదానం చేయండి ప్రాణదాతలుగా నిలవండి అనే నినాదంతో ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా అలంపూర్ నియోజకవర్గ ప్రజలు డాక్టర్.ఎస్.ఏ.సంపత్ కుమార్ కి ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు ఆ భగవంతుడు ప్రసాదించాలని, ఆయన చేపట్టే ప్రతి కార్యక్రమంలో విజయాలు చేకూరాలని ఆకాంక్షిస్తూ రక్తదానం ద్వారా తమ అభిమానాన్ని,ఆశీర్వాదాలను తెలియజేశారు.గద్వాల జిల్లా సోషల్ మీడియా జిల్లా కోఆర్డినేటర్ సంధ్య బాబు 14వసారి రక్తదానం చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.ఈ కార్య క్రమంలో ఎర్రవల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు టీ. నర్సిరెడ్డి,మాజీ అధ్యక్షులు వెంకటేష్ యాదవ్,జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నీలి శ్రీనివాసులు,పీఏసీఎస్ చైర్మన్ మధు నాయుడు,వైస్ చైర్మన్ శ్యాంసుందర్ రావు, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు ఆదాము, మండల జనరల్ సెక్రటరీ శ్రీనివాస్ రెడ్డి పరిపూర్ణాచారి,పల్లె నిర్మలరాజు,కొండేరు వెంకటేష్,అల్లాబకాస్, కుమ్మరి తిరుపతి,బాల్ రామ్,షేక్‌పల్లి బీసీ రెడ్డి, నారాయణ, ఇబ్రహీం,నాగరాజు, ఇటిక్యాల పీటర్, ప్రభాకర్,వేముల తిమ్మరాజు తదితరులు పాల్గొన్నారు.

వివాహ వేడుకలలో పాల్గొన్న బాసు హనుమంతు నాయుడు

గద్వాల (ప్రజా జ్యోతి) నవంబర్ 20:

గద్వాల నియోజకవర్గం పరిధిలోని వివిధ గ్రామాలలో జరిగిన వివాహ వేడుకలలో వారి ఆహ్వానం మేరకు గద్వాల నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ బాసు హనుమంతు నాయుడు పాల్గొని నూతన వధూవరులను తలంబ్రాలు వేసి ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బి ఆర్ఎస్ పార్టీ శ్రేణులు వివిధ గ్రామాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.







మునగాల గ్రామంలో సంపత్ కుమార్ జన్మదిన సందర్భంగా కేక్ కటింగ్

అలంపూర్ డివిజన్ (ప్రజా జ్యోతి)నవంబర్ 20:



అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ జన్మ దిన వేడుకలు మునగాల సర్పంచ్ కొప్పుల ప్రభాకర్ రెడ్డి ఇటిక్యాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆంజనేయులు వీరి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంపత్ కుమార్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం కాంగ్రెస్ ప్రజపాలనలో భాగంగా ఇందిరా జీవిత భీమా పథకం నమోదు కార్యక్రమం ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో శ్రీకాంత్ రెడ్డి గ్రామ సెక్రటరీ గంగాధర్ డిసిసి జనరల్ సెక్రెటరీ జైపాల్ రెడ్డి,రామచంద్రారెడ్డి, మండల అధ్యక్షుడు ఉపరి ఆంజనేయులు, మండల మాజీ అధ్యక్షుడు రుక్మందర్ రెడ్డి,మండల మైనార్టీ అధ్యక్షుడు ఎండీ అల్లాబకాష్,గోవర్దన్, నరేష్ ,చాందుబాషా, ఇబ్రహీం,తిరుమలేష్, వెంకటస్వామి, మరియు గ్రామ కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

నర్వలో ఇందిరమ్మ బీమా యాప్ ను ప్రారంబించిన అధికారులు

నర్వ నవంబరు 20 ప్రజా జ్యోతి



తెలంగాణ ప్రభుత్వం ఆర్భాటంగా ప్రారంభించిన ఇందిరమ్మ బీమా పథకం యాప్ను శనివారం నర్వ గ్రామపంచాయతీ వద్ద ఎంపీడీవో శ్రీనివాసులు, గ్రామ సర్పంచ్ టి హనుమంత రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, బి.సం చెన్నై సాగర్ లు పురారంభించారు, ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ బీమా పథకం ఒక ధీమాగా నిలుస్తుందని వారన్నారు, ఆ గ్రామాలలో ప్రతి రేషన్ కార్డు కుటుంబ యజమానులు, తమ యొక్క ఆధార్ కార్డు, రేషన్ కార్డు ని తీసుకొని గ్రామపంచాయతీ వద్ద ఏర్పాటుచేసిన కౌంటర్ వద్ద నమోదు చేయించుకోవాలని తెలిపారు, ఇది మాకు 18 సంవత్సరాల నుండి 59 సంవత్సరాల వయసు గలగా వారికి వర్తిస్తుందని తెలిపారు, ఈ కార్యక్రమంలో ఎంపీ ఓ రాఘవేందర్ రావ్, మండల నర్వ గ్రామ పంచాయతీ సెక్రెటరీ కృష్ణారెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు శరణప్ప. ఉప సర్పంచ్ డి అజయ్, ఆత్మకూర్ మార్కెటింగ్ వైస్ చైర్మన్ డి కృష్ణ రెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షులు ఆంజనేయ రెడ్డి. వార్డు మెంబర్లు అయిలప్ప, తదితరులు పాల్గొన్నారు.

మల్దకల్ స్వయంభూ తిమ్మప్ప స్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.24.66 లక్షలు

- గత ఏడాదితో పోలిస్తే రూ.2.83 లక్షలు అధికం

మల్దకల్ నవంబర్ 20(ప్రజా జ్యోతి ప్రతినిధి):





ఆదిశిలాక్షేత్రం మల్దకల్ శ్రీ స్వయంభూ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయ హుండీ ద్వారా రూ.24,66,640 ఆదాయం లభించినట్లు ఆలయ చైర్మన్ పట్వారి ప్రహ్లాదరావు, ఈవో సత్యచంద్రారెడ్డి తెలిపారు. శుక్రవారం ఆలయ ప్రాంగణంలో దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వరమ్మ ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. గత సంవత్సరం హుండీ ద్వారా రూ.21,82,936 ఆదాయం రాగా, ఈ ఏడాది రూ.24,66,640 ఆదాయం వచ్చినట్లు వారు వెల్లడించారు. గత ఏడాదితో పోలిస్తే ఈసారి రూ.2,83,704 అధికంగా ఆదాయం సమకూరిందని తెలిపారు. అదేవిధంగా చింతలముని దేవాలయ హుండీ ద్వారా రూ.26,141 ఆదాయం లభించినట్లు పేర్కొన్నారు. ఈ హుండీ లెక్కింపు కార్యక్రమంలో అభిలాష్ ఆధ్వర్యంలో ఎస్వీఎస్ సేవా సమితికి చెందిన 125 మంది సభ్యులు పాల్గొని లెక్కింపు నిర్వహించారు. అనంతరం సేవా సమితి సభ్యులను ఆలయ చైర్మన్, ఈవో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చిట్టెమ్మ గోపాల్, ఎస్వీ ఫంక్షన్ హాల్ నిర్వాహకులు పట్వారి అరవిందరావు, చంద్రశేఖరరావు, బాబురావు, దేవాదాయ శాఖ సిబ్బంది, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

12 సంవత్సరాలు పూర్తి చేసుకున్న శ్రీ సాయి చారిటబుల్ ట్రస్ట్

- గత 12 సంవత్సరాలుగా ప్రత్యేక సేవా కార్యక్రమాలు

- 9 సంవత్సరాలుగా జిల్లా ఆస్పత్రిలో రోగి సహాయకులకు అన్న ప్రసాద పంపిణీ

- ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు హకీమ్ మురళి

నాగర్ కర్నూల్ : నవంబర్ 20 (ప్రజా జ్యోతి)



నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని సత్యసాయి మందిరంలో శుక్రవారం శ్రీ సాయి ప్రశాంతి చారిటబుల్ సేవాట్రస్ట్ వార్షిక సమావేశాన్ని నిర్వహించారు. ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు హకిం మురళి సభ్యులతో సమావేశమై సేవా కార్యక్రమాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగవాన్ శ్రీ సత్య సాయిబాబా కృపా కటాక్షలతో శ్రీసాయి ప్రశాంతి చారిటబుల్ సేవా ట్రస్ట్ ఏర్పడి 12 సంవత్సరాలు పూర్తయిందని, ట్రస్ట్ ద్వారా సామాజిక, ఆధ్యాత్మిక, విజ్ఞాన, ఆర్థిక వనరులు సమకూరే పలు శిక్షణా కార్యక్రమాలు వివిధరిగా నిర్వహిస్తున్నామని అదేవిదంగా జిల్లా కేంద్రంలోని సాయి మందిరంలో మహిళలకు ట్రస్టు ఆధ్వర్యంలో టైలరింగ్, మగ్గం వర్క్, కంప్యూటర్, బ్యూటిషన్, ఆంగ్ల విద్య కోచింగ్, ఉపాధి నిమిత్తం టైలరింగ్, స్టాఫ్ నర్స్ ట్రైనింగ్ నిర్వహించి స్వయం ఉపాధి పొందే విధంగా ప్రత్యేక శిక్షణ తదితర కార్యక్రమమాలు నిర్వహిస్తున్నామ ని, పురుషులకు కంప్యూటర్, డ్రైవింగ్, విద్యా పరిజ్ఞానం, ఎలక్ట్రిషన్, సెల్ ఫోన్ రిపేరింగ్, ఎడ్యుకేషన్ శిక్షణతో పాటు, వైద్య సేవలు అందింస్తున్నామని తెలిపారు. అదేవిదంగా గత తొమ్మిది సంవత్సరాలుగా జిల్లా ఆసుపత్రిలో సత్యసాయి త్రాగు నీరు, రోగి వెంట వచ్చే రోగి సహాయకులకు ప్రతి రోజుమధ్యాహ్నం 150 మందికి అన్నప్రసాద పంపిణీ నిర్వహిస్తున్నామని త్రాగునీరు, అన్నప్రసాద పంపిణీ నిరంతరంగా కొనసాగుతుందని ఈ కార్యక్రమా ల నిర్వహణకు దాతలు సహకారం మరువలేనిద న్నారు. అన్నం పరబ్రహ్మ స్వరూపమని రోగి సహాయకులకు చేసే సేవ గొప్పసేవ అని అన్నారు. 2019 కరోనా సమయంలో ట్రస్ట్ ద్వారా పేదలకు త్రాగునీరు, నిత్యవసర సరుకులు, మందులు, వస్త్రాల ను పంపిణీ చేయడం జరిగిందని, స్టాఫ్ నర్స్ శిక్షణ చదివిన మహిళలు నేడు ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్నారని, టైలరింగ్ ద్వారా మహిళలు విశేషంగా ఉపాధి పొందుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్, కార్యదర్శి, సభ్యులు, భక్తులుపాల్గొన్నారు.

ప్రజా యుద్ధనౌక గద్దర్ ఆశయాలు చిరస్మరణీయం

- సమాజ మార్పు కోసం గద్దర్ చేసిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకం

వీపనగండ్లలో ఘనంగా గద్దర్ విగ్రహావిష్కరణ

వీపనగండ్ల, ప్రజా జ్యోతి రిపోర్టర్:

మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో ప్రజా యుద్ధనౌక గద్దర్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గద్దర్ కుమార్తె తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్ పర్సన్ గుమ్మడి వెన్నెల ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గద్దర్ విగ్రహాన్ని పూలమాలలతో అలంకరించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, ప్రజలు గద్దర్ ఆశయాలను స్మరించుకుంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా గుమ్మడి వెన్నెల మాట్లాడుతూ ప్రజా సమస్యలపై తన పాటలతో ప్రజలను చైతన్యపరిచిన మహానీయుడు గద్దర్ అని అన్నారు. అణగారిన వర్గాలు, పేదలు, కార్మికులు, రైతుల హక్కుల కోసం తన జీవితాన్ని అంకితం చేసిన ప్రజా కళాకారుడు గద్దర్ అని కొనియాడారు. ఆయన పాటల్లో ప్రజల బాధలు, కష్టాలు, సామాజిక అసమానతలపై పోరాట స్ఫూర్తి ప్రతిబింబించేదని పేర్కొన్నారు. గద్దర్ పాట అంటే కేవలం వినోదం కాదని, అది ప్రజల జీవితాలను ప్రతిబింబించే గొంతుక అని అన్నారు. సమాజంలో జరుగుతున్న అన్యాయాలు, వివక్ష, దోపిడీకి వ్యతిరేకంగా తన గళాన్ని వినిపిస్తూ ప్రజల్లో చైతన్యం నింపారని గుర్తు చేశారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

ప్రజల గుండెల్లో చిరస్థాయిగా గద్దర్ స్థానం



ప్రజా ఉద్యమాల్లో తన ఆటపాటలతో ప్రత్యేక గుర్తింపు పొందిన గద్దర్ తెలుగు రాష్ట్రాల ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేశారని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆయన రచించిన పాటలు, ప్రదర్శించిన కళారూపాలు సమాజ మార్పు కోసం నిరంతరం ప్రజలను చైతన్యపరుస్తాయని అన్నారు. గద్దర్ విగ్రహావిష్కరణతో వీపనగండ్ల మండల కేంద్రంలో ఆయన జ్ఞాపకాలు మరింత చిరస్థాయిగా నిలిచిపోతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాసంఘాల ప్రతినిధులు, కుల సంఘాల నాయకులు, యువకులు, మహిళలు, గద్దర్ అభిమానులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు. గద్దర్ విగ్రహావిష్కరణ సందర్భంగా మండల కేంద్రంలో పండుగ వాతావరణం నెలకొంది.



నాగర్ కర్నూల్ జిల్లా "ట్రస్మా" నూతన కార్యవర్గం ఎన్నిక

- జిల్లా అధ్యక్షుడిగా చిదిరే నరేష్





నాగర్ కర్నూల్ : 20 నవంబర్ (ప్రజా జ్యోతి)

తెలంగాణ 'రికగ్నైజ్డ్ స్కూల్స్' మేనేజ్మెంట్ అసోసియేషన్ నాగర్ కర్నూల్ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నికలు బుధవారం రాత్రి నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో నిర్వహించా రు.జిల్లా అధ్యక్షుడిగా శాంతినికేతన్ పాఠశాల కరస్పాండెంట్ చిదిరె నరేష్,ప్రధాన కార్యదర్శిగా రాజు యాదవ్ (అచ్చంపేట),ట్రెజరర్ గా శివకుమార్ (కొల్లాపూర్) లను ఏకగ్రీవంగా ఎన్నుకుని నూతనంగా ఎన్నికైన కమిటీతో సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు.కార్యక్రమానికి "ట్రస్మా" రాష్ట్ర అధ్యక్షులు ఎస్.మధుసూదన్,వైస్ ప్రెసిడెంట్ గోపాల్ రెడ్డి, ఎన్నికల అధికారిగా లక్ష్మణ్ మహబూబ్ నగర్ జి ల్లా అధ్యక్షుడు,జిల్లాలోని వివిధ పాఠశాలల కరస్పాండెంట్ లు పాల్గొన్నారు.

గద్దర్ అన్న విగ్రహావిష్కరణ సభలో డా: వెన్నెల గద్దర్ చేతుల మీదుగా గద్దరన్న పాట సీడీ ఆవిష్కరణ

- మీసాల రామన్నను అభినందించిన డాక్టర్ వెన్నెల గద్దర్.

వీపనగండ్ల ప్రజా జ్యోతి రిపోర్టర్.

మండల కేంద్రంలో ప్రజా యుద్ధనౌక, ప్రజా గాయకుడు దివంగత గద్దరన్న విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని పురస్కరించుకొని, మీసాల రామన్న రచన గానం చేసి రూపొందించిన పాటమ్మ నీకు వందనం గద్దరన్న దూరమాయనమ్మ అనే పాటను, సంస్కృతిక శాఖ చైర్పర్సన్ డా: వెన్నెల గద్దర్ చేతుల మీదుగా ఆవిష్కరణ చేయడం జరిగిందని, తెలంగాణ ఉద్యమకారుడు మీసాల రామన్న తెలిపారు. ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెన్నెల గద్దర్ మాట్లాడుతూ గద్దరన్న జీవితం ఒక పోరాట చరిత్రని, తన ఆటపాటలతో అణగారిన ప్రజల్లో చైతన్యం నింపిన గొప్ప ప్రజా కళాకారుడని కొనియాడారు. మీసాల రామన్న చక్కగా పాటను రచించి, గానం చేశారని అభినందించారు. ఈ సందర్భంగా మీసాల రామన్న మాట్లాడుతూ,,, గద్దరన్న పోరాట స్ఫూర్తిని, ప్రజా చైతన్యాన్ని భావితరాలకు తెలియజేయాలనే ఉద్దేశంతో ఈ పాటను రూపొందించినట్లు తెలిపారు. ఆయన పాటల ద్వారా అందించిన సందేశం ఎప్పటికీ ప్రజల్లో సజీవంగా ఉంటుందని పేర్కొన్నారు. వీపనగండ్లలో ఎత్తం కృష్ణన్న ఆధ్వర్యంలో గద్దర్ విగ్రహం ఏర్పాటు చేయడం అభినందనీయమనిఅన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

మతసామరస్యం, సోదరభావానికి ప్రతీకగా పవిత్ర గ్యార్మీ వేడుకలు

- అశోక్ టాకీస్ పరిధిలో నిర్వహించిన వేడుకలో పాల్గొన్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఏపీ మిథున్ రెడ్డి

మహబూబ్‌నగర్, నవంబర్ 20 (ప్రజా జ్యోతి బ్యూరో):

మతాలు వేరైనా మనుషుల మధ్య ప్రేమాభిమానాలు, సోదరభావం, ఐక్యతే సమాజానికి నిజమైన బలమని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏపీ మిథున్ రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని అశోక్ టాకీస్ పరిధిలో నిర్వహించిన పవిత్ర గ్యార్మీ వేడుకల్లో ఆయన పాల్గొని, మైనారిటీ సోదరులతో కలిసి వేడుకలో భాగస్వామ్యమయ్యారు.నూర్ సాబ్ ఆహ్వానం మేరకు కార్యక్రమానికి హాజరైన మిథున్ రెడ్డి మాట్లాడుతూ, సోదరభావం, మతసామరస్యం, పరస్పర గౌరవం, ఐక్యతకు ప్రతీకగా నిలిచే ఇలాంటి వేడుకల్లో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ప్రజల మధ్య ప్రేమాభిమానాలు, సౌహార్దం, సౌభ్రాతృత్వం ఎల్లప్పుడూ వెల్లివిరియాలని ఆకాంక్షించారు. సమాజంలో శాంతి, సామరస్యం నెలకొనాలంటే అన్ని మతాల ప్రజలు పరస్పర గౌరవంతో కలిసిమెలిసి జీవించాలని, భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటే ఇలాంటి కార్యక్రమాలు సామాజిక ఐక్యతను మరింత బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు.ఈ సందర్భంగా వేడుక నిర్వాహకులు, మైనారిటీ సోదరులతో కలిసి పండుగ శుభాకాంక్షలు పంచుకున్నారు.



అంబేద్కర్ విగ్రహ నిర్మాణ పనుల్లో అవకతవకలకు తావివ్వొద్దు

- నాణ్యతతో పనులు పూర్తి చేయాలి..

కాంట్రాక్టర్‌కు కౌన్సిలర్ షేక్ ఏజాస్ సూచన

కల్వకుర్తి, నవంబర్ 20 (ప్రజా జ్యోతి):

కల్వకుర్తి పట్టణంలోని 10వ వార్డు మహబూబ్ నగర్ చౌరస్తాలో కొనసాగుతున్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహ నిర్మాణ పనులనుఆవార్డు కౌన్సిలర్ షేక్ ఏజాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనుల పురోగతిని, నాణ్యతను పరిశీలించి కాంట్రాక్టర్‌కు పలు సూచనలు చేశారు.అంబేద్కర్ విగ్రహ నిర్మాణం ఎంతో ప్రతిష్ఠాత్మకమైనదని, పనుల్లో ఎలాంటి నాణ్యతా లోపాలకు, అవకతవకలకు తావులేకుండా నిబంధనల ప్రకారం బాధ్యతాయుతంగా నిర్మాణ పనులు చేపట్టాలని సూచించారు. నాణ్యతతో పనులు పూర్తి చేసి ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా విగ్రహ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు.





మొకర్లాబాద్ లో "ఖేత్ బచావో అభియాన్" (పొలాన్ని రక్షించుకుందాం) కార్యక్రమం పై రైతులకు అవగాహన కార్యక్రమం

మహ్మదాబాద్ నవంబర్ 20 (ప్రజా జ్యోతి)

రైతులకు"ఖేత్ బచావో అభియాన్ "(పొలాన్ని రక్షించుకుందాం) . మరియు ఎరువుల సమతుల్యత తదితర అంశాలపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారులు మాట్లాడుతూ భూసారాన్ని కాపాడుకోవడం నానో యూరియా వాడకం యాసంగిలో ఆరుతడి పంటలు సాగు, మరియు పంట మార్పిడి ఎంతో అవసరమని సూచించారు రైతులు ఈ పద్ధతులను పాటిస్తూ తక్కువ పెట్టుబడితో అధిక నాణ్యమైన దిగుబడులను సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లక్ష్మిమైబయ్య,మండల ప్రత్యేక అధికారి,ఎంపిడిఓ నరేందర్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి నరేందర్, ఏ ఈ ఓ నికిత, పంచాయతీ కార్యదర్శి, ప్రజా ప్రతినిధులు మరియు గ్రామ రైతులు పాల్గొన్నారు.



అర్హులైన ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా రక్షణ

- ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంపై జిల్లావ్యాప్తంగా విస్తృత ప్రచారం

మహబూబ్‌నగర్, నవంబర్ 20 (ప్రజా జ్యోతి బ్యూరో):

కుటుంబంలో ఆపద సంభవించినప్పుడు ఆర్థిక భరోసా కల్పించి, బాధిత కుటుంబాలను ఆదుకోవాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంపై మహబూబ్‌నగర్ జిల్లావ్యాప్తంగా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆదేశాల మేరకు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పోస్టర్లు, కరపత్రాల ద్వారా ప్రజలకు పథకం ప్రయోజనాలను వివరించారు.బాలానగర్ మండలంలోని అప్పాజిపల్లి, సూరారం, బొడజానంపేట, గౌతాపూర్, నందారం, గుండేడ్, నెరళ్లపల్లి, చెన్నాయిపల్లి తండా, నెలబండ తండా, నంచర్ల తదితర గ్రామాల్లో ప్రచార కార్యక్రమాలు చేపట్టారు. మహమ్మదాబాద్ మండలం మొకర్లాబాద్, జడ్చర్ల మండలం కొత్త తండా, గండీడ్ మండలం చెన్నాయిపల్లి తండా, మూసాపేట మండలం కోమిరెడ్డిపల్లి గ్రామాల్లోనూ పథకంపై ప్రజలకు అవగాహన కల్పించారు. మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, మేయర్, ముడా చైర్‌పర్సన్ తదితర ప్రజాప్రతినిధులు తెలుగు, ఉర్దూ భాషల్లో రూపొందించిన పథకం పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించి, పట్టణ ప్రజలకు పథకం లక్ష్యాలు, ప్రయోజనాలను వివరించారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు కలిగిన ఉపాధి పొందే కుటుంబ సభ్యులకు సంబంధించిన నిబంధనల మేరకు అర్హులైన కుటుంబాలకు



రూ.5 లక్షల జీవిత బీమా రక్షణ కల్పించనున్నారు. బీమా పొందే వ్యక్తులు తమ నామినీ వివరాలను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలి. దరఖాస్తు సమయంలో ఆధార్ కార్డు, రేషన్ కార్డు, బీమా పొందే వ్యక్తి వివరాలు, నామినీ వివరాలు, మొబైల్ నంబర్ సిద్ధంగా ఉంచుకోవాలని అధికారులు సూచించారు. గ్రామీణ ప్రాంత ప్రజలు గ్రామ పంచాయతీ కార్యాలయాలు లేదా సంబంధిత గ్రామస్థాయి అధికారులను, పట్టణ ప్రాంత ప్రజలు మున్సిపల్ కార్యాలయాలు లేదా ప్రభుత్వం ఏర్పాటు చేసే ప్రత్యేక నమోదు కేంద్రాలను సంప్రదించి పథకం వివరాలు తెలుసుకోవాలని కోరారు. ప్రభుత్వం ప్రకటించే నమోదు తేదీలు, మార్గదర్శకాల ప్రకారం దరఖాస్తు ప్రక్రియను పూర్తి



చేయాలని సూచించారు.ఆపద సమయంలో కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పిస్తూ అండగా నిలవడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమని అధికారులు, ప్రజాప్రతినిధులు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ పథకంపై అవగాహన పెంచుకొని, ప్రభుత్వ నిబంధనల మేరకు నమోదు చేసుకుని ప్రయోజనం పొందాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమాల్లో మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, వ్యవసాయ అధికారులు, ఏఈవోలు, ఏపీవోలు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

నాణ్యతగా పెద్ద జట్రం బిజ్వార్ R&Bరోడ్డు విస్తరణ పనులను చేయాలి

- గ్రామాల మీదుగా అంతర్గత సిసి రోడ్డు వేయాలి

- సిపిఐ (ఎంఎల్) మాసలైన్ పార్టీ నాయకుల డిమాండ్

ఉట్కూర్ నవంబర్ 20 (ప్రజాజ్యోతి)

జక్లేర్ పెద్దజట్రం బిజ్వార్ ఆర్ అండ్ బి రోడ్డు విస్తరణ పనులు వేగవంతంగా కొనసాగుతున్న పనులను సిపిఐ (ఎం.ఎల్) మాస్ లైన్ పార్టీ డివిజన్ నాయకులు పి వై ఎల్ జిల్లా కార్యదర్శి, సిద్దు ఏఐపీకేఎంఎస్ జిల్లా సహాయ కార్యదర్శి మల్లేష్ , ఎల్లప్ప,రైతు సంఘం నాయకులు స్త్ర. రవి బృందం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూమాస్ లైన్ పార్టీ చుట్టు ప్రక్కల,ప్రజలు రోడ్డు విస్తరణ కోసం చాలా సంవత్సరాల నుండి పోరాడుతూ వస్తున్నారు. 2025 లో 86 లక్షల రూపాయలు రోడ్డు మంజూరు చేయించిన టెండర్లు చేసిన చేపట్టకపోవడంతో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ ప్రజా సంఘాలు ఆధ్వర్యంలో ఆందోళనలు చేపట్టినారు. తక్షణమే రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలనిజక్లేర్ జాతీయరహదారి దిగ్బంధనం చేయడం జరిగిందన్నారు. ఫలితంగా, పనులు ప్రారంభించారు.18 కిలోమీటర్ల రోడ్డు 86 కోట్లతో నిర్మిస్తున్న రెండు లైన్లుగా పనులు మూడు నెలల కాల వ్యవధిలో, కొన్ని కల్వర్టులు నిర్మాణాలు పూర్తి చేశారు. అవసలోని పల్లి, బిజ్వార్ గ్రామాల మధ్యలో మరియు పులిమామిడి కల్వర్టులు నిర్మించిన వాటికి వాటర్ క్యూరింగ్నీరు రెగ్యులర్గా కనీసం 7రోజులు కూడాపోయలేదు. మట్టి



తవ్విన తర్వాత మొరము వేస్తున్నప్పటికీ వాటర్ తగినంత వేయటం లేదు. 20 ఎంఎం కంకర ను వేసిన నీరు పోసి తర్వాత రూలర్ తోలవలసి ఉండగా . అలా జరగటం లేదు. జరుగుతున్నది పనులు త్వరగా పూర్తి చేయాలన్న దానితో పనులను అంతంత మాత్రంగా చేస్తున్నారు. నాణ్యత లోపించి తర్వాత రోడ్డు పగిలి పోయే అవకాశం ఉన్నది కాంట్రాక్టర్, ఇంజనీరింగ్ అధికారులు అలసత్వం వీడి, పర్యవేక్షణ చేస్తూ తగిన మోతాదులో నాణ్యత తగ్గకుండా, చేయాలన్నారు. గ్రామ రహదారులు సిసి రోడ్డును వేసి పూర్తి చేయాలన్నారు,పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలని కోరారు.



నాసిరకంగా పనులు చేసినచో రోడ్డు ధ్వంసమయ్యే అవకాశం ఉందన్నారు తక్షణమే అధికారులు పర్యవేక్షించి రోడ్డు నాణ్యతను మెరుగుపరచాలని డిమాండ్ చేశారు. గ్రామాల జక్లేరు పులిమామిడి బిజ్వార్ పెద్దజెట్రశీ గ్రామ రహదారులు సిసి రోడ్లు వేయాలన్నారు, బిజ్వార్ ఫుల్ మామిడి బోయ రాజప్ప శివన్న పొలాల దగ్గర వాగు భారీగా పారుతుందని బ్యాక్ సైడ్ రాతి రివర్మెంట్ కట్టించాలన్నారు లేనిచో వరదకు రోడ్డు తెగిపోయే ప్రమాదం ఉందన్నారు. పై అధికారులు పర్యవేక్షించి తగిన చర్యలు చేపట్టాలన్నారు.ఈ బృందంలో బిజ్వార్ గ్రామ ఉపసర్పంచ్ గోవర్ధన్ రెడ్డి వార్డు సభ్యులు ఎల్లప్ప తమప్ప ప్రవీణ్ రెడ్డి తదితరులు ఉన్నారు.

ఓబీసీ కులగణన కోసం ఢిల్లీలో ‘చలో రామ్‌లీలా మైదాన్’

- నవంబర్ 28న జాతీయ స్థాయి ఉద్యమానికి మద్దతు..

- కేటీఆర్‌కు ఆహ్వానం అందించిన ఓబీసీ విద్యార్థి సంఘం నేతలు

మహబూబ్‌నగర్/ హైద్రాబాద్ , నవంబర్ 20

(ప్రజా జ్యోతి బ్యూరో):

దేశవ్యాప్తంగా ఓబీసీ (బీసీ) కులగణన చేపట్టి, జనాభా ప్రాతిపదికన విద్య, ఉద్యోగాలు, రాజకీయ రంగాల్లో తగిన రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ నవంబర్ 28న న్యూఢిల్లీలోని రామ్‌లీలా మైదాన్‌లో నిర్వహించనున్న భారీ ఉద్యమానికి మద్దతు కూడగడుతున్నారు. ఆల్ ఇండియా ఓబీసీ కోఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టనున్న ‘చలో రామ్‌లీలా మైదాన్’ కార్యక్రమానికి హాజరుకావాలని కోరుతూ బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఓబీసీ విద్యార్థి సంఘం నాయకులు ఆహ్వానించారు. మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో ఆల్ ఇండియా ఓబీసీ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ కోఆర్డినేటర్లు జయంత్ యాదవ్, రజినీకాంత్ గౌడ్, మురళీకృష్ణ, చిద్విలాస్, కిరణ్, లోకేష్ తదితరులు కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి కార్యక్రమానికి రావాలని కోరారు. ఈ సందర్భంగా కేటీఆర్ తన సంపూర్ణ మద్దతును ప్రకటించినట్లు నాయకులు తెలిపారు.

కులగణనతోనే జనాభా ప్రాతిపదికన న్యాయం

ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలని కేసీఆర్ గతంలో అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపారని గుర్తు చేశారు. స్థానిక సంస్థల్లో బీసీలకు అవకాశాలు కల్పించడంతో పాటు, రాజ్యసభ, శాసనమండలి, నామినేటెడ్ పదవుల్లోనూ బీసీలకు ప్రాధాన్యత ఇచ్చినట్లు పేర్కొన్నారు. బీసీలలో రాజకీయ చైతన్యం పెంపొందించాలనే సంకల్పంతో కేసీఆర్ అనేక చర్యలు చేపట్టారని అన్నారు. రిజర్వేషన్లు జనాభా ప్రాతిపదికన అమలు చేయాలంటే సమగ్ర కులగణన తప్పనిసరి అని స్పష్టం చేశారు. పార్లమెంట్‌లో బీఆర్ఎస్ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర సైతం కులగణన చేపట్టాలని డిమాండ్ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. దేశంలో ఓబీసీల జనాభా ఎంత ఉందో అధికారికంగా లెక్క తేలితేనే వారికి తగిన ప్రాతినిధ్యం, హక్కులు కల్పించే అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు.

బీసీల విద్య, ఉపాధి, ఆర్థిక అభివృద్ధికి కేసీఆర్ హయాంలో ప్రాధాన్యత

బీసీలు, బహుజనుల అభివృద్ధి కోసం కేసీఆర్ పాలనలో విద్య, ఉపాధి, ఆర్థిక సహాయం, కులవృత్తుల అభివృద్ధి, సామాజిక గౌరవం వంటి రంగాల్లో పలు కార్యక్రమాలు చేపట్టినట్లు కేటీఆర్ వివరించారు. బీసీల అభివృద్ధి అంటే తెలంగాణ అభివృద్ధి అని నమ్మిన కేసీఆర్, బీసీలకు ఆత్మగౌరవం, ఆర్థిక స్వావలంబన, రాజకీయ ప్రాధాన్యత కల్పించేందుకు కృషి చేశారని పేర్కొన్నారు. దాదాపు వెయ్యి గురుకుల విద్యాసంస్థల విస్తరణ ద్వారా పేద బీసీ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే అవకాశాలు కల్పించారని, ప్రీ-మెట్రిక్, పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి సదుపాయాలు కల్పించారని తెలిపారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే బీసీ యువత కోసం స్టడీ సర్కిళ్ల ద్వారా ఉచిత శిక్షణ కార్యక్రమాలను ప్రోత్సహించినట్లు వివరించారు.

కులవృత్తులకు చేయూత.. ఆత్మగౌరవానికి ప్రాధాన్యత

ముదిరాజ్, గౌడ, యాదవ, కురుమ, మత్స్యకార, రజక, నాయీ బ్రాహ్మణ, విశ్వబ్రాహ్మణ, కుమ్మరి, వడ్డెర తదితర వృత్తి ఆధారిత బీసీ వర్గాల అభివృద్ధికి ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టినట్లు పేర్కొన్నారు.



నాయీ బ్రాహ్మణులకు ఉచిత విద్యుత్, గౌడ కులస్తులకు ఉపాధి సంబంధిత ప్రోత్సాహకాలు, మత్స్యకారులకు చేప పిల్లల పంపిణీ, ముదిరాజ్, గంగపుత్రులకు వివిధ సహాయ కార్యక్రమాలు, యాదవులకు ప్రభుత్వ సబ్సిడీతో గొర్రెల పంపిణీ వంటి పథకాలు అమలు చేసినట్లు తెలిపారు. చేనేత రంగాన్ని ఆదుకునేందుకు రుణమాఫీ కార్యక్రమాలు చేపట్టడంతో పాటు, బతుకమ్మ చీరల తయారీ ద్వారా నేతన్నలకు ఉపాధి కల్పించారని, ప్రభుత్వ కొనుగోళ్ల ద్వారా చేనేత రంగానికి ప్రోత్సాహం అందించారని తెలిపారు. వివిధ బీసీ కులాల సహకార సంఘాలు, ఫెడరేషన్ల ద్వారా వృత్తిదారులకు ఆర్థిక చేయూత అందించే కార్యక్రమాలు కూడా చేపట్టినట్లు వివరించారు. ఓబీసీల హక్కులు, రాజకీయ ప్రాతినిధ్యం, సామాజిక న్యాయం కోసం దేశవ్యాప్తంగా ఒకే వేదికపై ఉద్యమించాల్సిన అవసరం ఉందని నాయకులు పేర్కొన్నారు. నవంబర్ 28న ఢిల్లీలో నిర్వహించనున్న చలో రామ్‌లీలా మైదాన్ కార్యక్రమానికి బీసీ, ఓబీసీ సంఘాలు, విద్యార్థులు, యువత, సామాజిక ఉద్యమకారులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.

పేదరికం ప్రతిభకు అడ్డంకి కాకూడదు.. వైద్య విద్యార్థిని ఆకాంక్షకు రెడ్‌క్రాస్ అండ

- ఎంబీబీఎస్ నాలుగో సంవత్సరం చదువుతున్న విద్యార్థినికి రూ.85 వేల ఆర్థిక సహాయం..

మూడు సంవత్సరాలుగా కొనసాగుతున్న చేయూత

మహబూబ్‌నగర్, నవంబర్ 20 (ప్రజా జ్యోతి బ్యూరో):



మహబూబ్‌నగర్ రూరల్ మండలం కోడూరు గ్రామానికి చెందిన ప్రతిభావంతురాలైన విద్యార్థిని ఆకాంక్ష వైద్య విద్యాభ్యాసానికి ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మహబూబ్‌నగర్ జిల్లా శాఖ అండగా నిలుస్తోంది. పేద కుటుంబానికి చెందిన ఆకాంక్ష ప్రస్తుతం నల్గొండ ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ నాలుగో సంవత్సరం చదువుతోంది. ఆకాంక్ష తండ్రి నర్సింలు మేస్త్రీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఆకాంక్ష తన ప్రతిభతో వైద్య విద్యలో ప్రవేశం సాధించి ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగుతోంది. ఆమె చదువుకు గత మూడు సంవత్సరాలుగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మహబూబ్‌నగర్ జిల్లా శాఖ ఆర్థిక సహాయం అందిస్తూ ప్రోత్సహిస్తోంది. ఈ క్రమంలో ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించి రూ.85 వేల ఆర్థిక సహాయాన్ని శుక్రవారం మహబూబ్‌నగర్‌లోని రెడ్‌క్రాస్ భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆకాంక్ష తల్లిదండ్రులకు చెక్కు రూపంలో అందజేశారు. జిల్లా కలెక్టర్, రెడ్‌క్రాస్ అధ్యక్షురాలు ఖుష్బూ గుప్తా అనుమతితో జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ కె.ఎస్. రవికుమార్ జాయింట్ సిగ్నేచర్ చేసి ఆర్థిక సహాయ చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ డైరెక్టర్లు, సభ్యులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. పేదరికం ప్రతిభకు అడ్డంకి కాకూడదనే లక్ష్యంతో ప్రతిభావంతులైన నిరుపేద విద్యార్థులకు రెడ్‌క్రాస్ ఆర్థిక చేయూత అందిస్తూ వారి విద్యాభ్యాసానికి తోడ్పడుతోందని చైర్మన్ కె.ఎస్. రవికుమార్ తెలిపారు. ఆకాంక్ష భవిష్యత్తులో మంచి వైద్యురాలిగా ఎదిగి ప్రజలకు, సమాజానికి సేవ చేయాలని ఆకాంక్షించారు.

జర్నలిస్టుల కుటుంబ భద్రతకు టర్మ్ ఇన్సూరెన్స్ తప్పనిసరి

– సీనియర్ జర్నలిస్ట్ షాబుద్దీన్ కుటుంబానికి

రూ.25 వేల ఆర్థిక సాయం..

ఆపదలో జర్నలిస్టులంతా అండగా నిలవాలి : ఎమ్మెల్యే యెన్నం

మహబూబ్‌నగర్, నవంబర్ 20 (ప్రజా జ్యోతి బ్యూరో):

జర్నలిస్టుల వృత్తిలో ఎన్నో ఒత్తిళ్లు, సవాళ్లు ఎదురవుతుంటాయని, అనుకోని ఆపదలు సంభవించినప్పుడు వారి కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులకు గురికాకుండా ప్రతి జర్నలిస్టు టర్మ్ ఇన్సూరెన్స్ తీసుకోవాలని ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి సూచించారు. కష్టకాలంలో జర్నలిస్టుల కుటుంబాలకు తోటి జర్నలిస్టులు అండగా నిలవడం ఎంతో అభినందనీయమని అన్నారు.ఇటీవల గుండె సంబంధిత సమస్యతో ఆకస్మికంగా మృతి చెందిన సీనియర్ జర్నలిస్ట్ షాబుద్దీన్ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి వారి నివాసంలో పరామర్శించారు. పాలమూరు జర్నలిస్టుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కుటుంబ సభ్యులకు రూ. 25 వేల ఆర్థిక సహాయాన్ని చెక్కు రూపంలో అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, జర్నలిస్ట్ కుటుంబానికి అండగా నిలవాలనే మంచి ఆలోచనతో ముందుకు వచ్చిన పాలమూరు జర్నలిస్టుల సంక్షేమ సంఘం సభ్యులను అభినందించారు. ఆర్థిక సహాయం మొత్తం ఎంత అన్నది ముఖ్యం కాదని, ఆపద సమయంలో ఒక కుటుంబానికి అండగా నిలిచి మనోధైర్యాన్ని కల్పించడం గొప్ప మానవతా కార్యక్రమమని పేర్కొన్నారు.జర్నలిస్టుల వృత్తి అనేక ఒడిదుడుకులతో కూడుకున్నదని, విధి నిర్వహణలో ఎదురయ్యే ఒత్తిళ్లతో పాటు వ్యక్తిగత, కుటుంబ భద్రతను కూడా దృష్టిలో ఉంచుకోవాలని సూచించారు. ప్రతి జర్నలిస్టు తమ కుటుంబ భవిష్యత్తు కోసం టర్మ్ ఇన్సూరెన్స్ తీసుకోవడం అవసరమని పేర్కొన్నారు. అనుకోని ప్రమాదాలు, విషాద



ఘటనలు ఎదురైనప్పుడు బాధిత కుటుంబాలను ఆదుకునేందుకు జర్నలిస్టులంతా పరస్పర సహకారంతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు.షాబుద్దీన్ కుటుంబానికి తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చిన ఎమ్మెల్యే, జర్నలిస్టుల మధ్య ఐక్యత, సోదరభావం, పరస్పర సహకారం మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగాలని అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సిరాజ్ ఖాద్రీ, కార్పొరేటర్లు షబ్బీర్ అహ్మద్, అవేజ్, తాహేర్, పాలమూరు జర్నలిస్టుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు వాకిట అశోక్ కుమార్, కోశాధికారి జిల్లెల రఘు, పల్లెమోని యాదయ్య, రమాకాంత్ రెడ్డి, సతీష్ రెడ్డి, ప్యాట వెంకటయ్య, జాఫర్, ఆహ్మద్ సిద్ధికి, తకి హుస్సేన్, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఈనెల 26న,ఉచిత కంటి ఆపరేషన్ శిబిరం

- ఆప్తాలామిక్ అధికారి కొట్ర బాలాజీ

నాగర్ కర్నూల్ :: 20 నవంబర్ (ప్రజా జ్యోతి)

నాగర్ కర్నూలు,జిల్లా వైద్య ఆరోగ్యశాఖ,మరియు జిల్లా అందత్వ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 26 న, (గురువారం) జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ కార్యాలయంలో ఉదయం 9:00 నుండి 11:00 గంటల వరకు ఉచిత కంటి చికిత్స శిబిరం నిర్వహిస్తున్నట్లు నాగర్ కర్నూలు ఆప్తాలమిక్ అధికారి కొట్ర బాలాజీ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.ఈ శిబిరంలో రోగులకు ప్రత్యేక కంటి పరీక్షలు, సాధారణ పరీక్షలు నిర్వహించి,క్యాటరాక్టు పోర గల వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు మహబూబ్ నగర్ ఏనుగొండలోని లయన్ రామ్ రెడ్డి కంటి ఆసుపత్రిలో నిర్వహించ నున్నట్లు కొట్ర బాలాజీ తెలిపారు. రోగులు ముందుగా బి.పి,షుగర్ పరీక్షలు చేసుకొని రిపోర్టులను మరియు ఆధార్ కార్డు,రేషన్ కార్డు,ఓటర్ కార్డులో ఏదేని ఒక గుర్తింపు కార్డు జిరాక్స్ కాపీని వెంట తెచ్చుకోవాలని ఇతర వివరా లకు 9440876556 ఉ 7386940480 లో సంప్రదించాలని అన్నారు.



ప్రేమ పేరుతో మోసం.. లైంగిక దాడి కేసులో నిందితుడికి 10 ఏళ్ల జైలు

- పటిష్ట దర్యాప్తు, సాక్ష్యాధారాలతో శిక్ష ఖరారు..

పోలీసు, ప్రాసిక్యూషన్ బృందానికి ఎస్పీ జానకి సన్మానం

మహబూబ్‌నగర్ నవంబర్ 20 (ప్రజా జ్యోతి బ్యూరో):

ప్రేమ పేరుతో యువతిని మోసం చేసి లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితుడికి న్యాయస్థానం 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ. 6 వేల జరిమానా విధించింది. కేసును సమర్థవంతంగా దర్యాప్తు చేసి, నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన పోలీసు అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్, కోర్టు లైజన్ సిబ్బందిని జిల్లా ఎస్పీ దరావత్ జానకి అభినందించి సన్మానించారు.మహబూబ్‌నగర్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన క్రైమ్ నంబర్ 102/2024 కేసులో న్యాయస్థానం నిందితుడికి శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించింది. ఈ నేపథ్యంలో కేసు దర్యాప్తులో కీలక పాత్ర పోషించి, న్యాయస్థానంలో పటిష్టమైన సాక్ష్యాధారాలు సమర్పించి నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన మహబూబ్‌నగర్ రూరల్ సీఐ, దర్యాప్తు అధికారి బి. గాంధీనాయక్, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె. మేనూ శ్రీ, కోర్టు లైజన్ హెడ్ కానిస్టేబుల్ ఎం. విజయ్ కుమార్, అసిస్టెంట్ లైజన్ రమేష్, కోర్టు డ్యూటీ ఆఫీసర్ అశోక్ రెడ్డిలను శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని తన చాంబర్‌కు ఎస్పీ ఆహ్వానించారు.వారికి శాలువాలు కప్పి, జ్ఞాపికలు అందజేసి ఘనంగా సన్మానించారు. కేసును సమర్థవంతంగా నడిపించి న్యాయస్థానంలో నిందితుడికి శిక్ష పడేలా చేసిన అధికారుల కృషిని ఎస్పీ ప్రశంసించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, మహిళలు, యువతులపై జరిగే నేరాలకు సంబంధించిన కేసుల్లో సమగ్ర దర్యాప్తు, పటిష్టమైన సాక్ష్యాధారాల సేకరణ, న్యాయస్థానంలో సమర్థవంతమైన వాదనలు అత్యంత కీలకమని పేర్కొన్నారు. బాధితులకు న్యాయం జరిగేలా పోలీస్ శాఖ, ప్రాసిక్యూషన్, కోర్టు లైజన్ విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నేరస్థులకు చట్టపరంగా శిక్ష పడేలా బాధ్యతాయుతంగా పనిచేసే పోలీసు, న్యాయ సిబ్బంది కృషి సమాజంలో న్యాయంపై నమ్మకాన్ని పెంపొందిస్తుందని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.



లక్ష్య సాధనకు నిరంతర సాధన, క్రమశిక్షణే కీలకం - చదువుతో పాటు పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలి.. విద్యార్థులకు ఎమ్మెల్యే యెన్నం సూచన

మహబూబ్‌నగర్ నవంబర్ 20 (ప్రజా జ్యోతి బ్యూరో):

జీవితంలో అనుకున్న లక్ష్యాలను సాధించాలంటే నిరంతర సాధన, క్రమశిక్షణ, పట్టుదలతో పాటు ఆత్మవిశ్వాసం ఎంతో అవసరమని ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు పుస్తక పఠనంపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, భవిష్యత్తు లక్ష్యాల దిశగా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని సూచించారు. జిల్లా గ్రంథాలయంలో నిర్వహించిన 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వ్యాసరచన, క్విజ్, చెస్, డ్రాయింగ్ తదితర పోటీల్లో ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పోటీ పరీక్షలకు సిద్ధం కావడం, ఇంగ్లీష్ భాషలో ప్రావీణ్యం సాధించడం వంటి లక్ష్యాల కోసం కనీసం ఏడాది పాటు నిర్దిష్ట ప్రణాళికతో కృషి చేయాలని సూచించారు. విద్యార్థులు తమపై తాము నమ్మకం పెంచుకుని, లక్ష్య సాధన కోసం నిరంతరం శ్రమించాలని అన్నారు. పాఠశాల స్థాయి నుంచే వివిధ పోటీల్లో పాల్గొనడం ద్వారా ఆత్మవిశ్వాసం, ప్రతిభ, పోటీతత్వం పెంపొందుతాయని పేర్కొన్నారు. పదో తరగతిలో మంచి మార్కులు సాధించి, ఇంటర్మీడియట్‌లో ఉత్తమ కళాశాలల్లో చదువుకోవడంతో



పాటు, భవిష్యత్తులో తమ ఆసక్తికి అనుగుణంగా ప్రొఫెషనల్ కోర్సుల్లో ప్రవేశాలు పొందేలా విద్యార్థులు ఇప్పటి నుంచే కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రతిరోజూ కొంత సమయాన్ని పుస్తక పఠనానికి కేటాయించాలని, పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా విజ్ఞానాన్ని పెంపొందించే ఇతర పుస్తకాలను కూడా చదవాలని సూచించారు. పుస్తక పఠనం వల్ల జ్ఞానం పెరగడంతో పాటు ఆలోచనా పరిధి విస్తరిస్తుందని, గ్రంథాలయాలు విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంపొందించడంతో పాటు వారి ప్రతిభను వెలికితీయడానికి గ్రంథాలయ వారోత్సవాలు ఎంతగానో దోహదపడతాయని



పేర్కొన్నారు. విద్యార్థుల్లో విజ్ఞానాన్ని పెంపొందిస్తూ, వివిధ పోటీల ద్వారా వారి నైపుణ్యాలను ప్రోత్సహిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ, గ్రంథాలయ శాఖ అధికారులు, సిబ్బందిని ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ గుమ్మాల మమత, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, నాయకులు గోవింద్ యాదవ్, కార్పొరేటర్లు తిరుమల వెంకటేష్, మేఘ్యానాయక్, రమేష్ రెడ్డి, గ్రంథాలయ సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక ప్రపంచంపై ఆసక్తి పెంచేలా విద్యార్థులకు ఇండస్ట్రీ, ఐటీ విజిట్

- జేపీఎన్‌సీఈలో భూత్పూర్ జెడ్పీహెచ్ఎస్ విద్యార్థుల సందడి..

- 250 మంది విద్యార్థులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై ప్రత్యక్ష అవగాహన

మహబూబ్‌నగర్, నవంబర్ 20 (ప్రజా జ్యోతి బ్యూరో):

పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనా విధానం, సాంకేతిక పరిజ్ఞానంపై ఆసక్తి, నూతన ఆవిష్కరణల పట్ల జిజ్ఞాస పెంపొందించాలనే లక్ష్యంతో మహబూబ్‌నగర్‌లోని జయప్రకాశ్ నారాయణ ఇంజినీరింగ్ కళాశాల లో ఇండస్ట్రీ అండ్ ఐటీ విజిట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. భూత్పూర్‌కు చెందిన పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొని ఆధునిక సాంకేతిక రంగాలపై ప్రత్యక్ష అవగాహన పొందారు. 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న సుమారు 250 మంది విద్యార్థులు ఈ సందర్శనలో పాల్గొన్నారు. కళాశాలలోని సివిల్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, మెకానికల్, కంప్యూటర్ సైన్స్ విభాగాలకు చెందిన ప్రయోగశాలలను సందర్శించారు. అక్కడ ఏర్పాటు చేసిన ఆధునిక యంత్రాలు, పరికరాలు, సాంకేతిక సదుపాయాలను ఆసక్తిగా పరిశీలించారు. పాఠ్యపుస్తకాల్లో చదివిన సైద్ధాంతిక అంశాలను ప్రయోగశాలల్లో ప్రత్యక్షంగా చూడడం ద్వారా విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానంపై మరింత స్పష్టమైన అవగాహన ఏర్పడింది. ఆయా విభాగాల అధ్యాపకులు యంత్రాల పనితీరు, వాటి వినియోగం, సాంకేతిక రంగాల్లో వస్తున్న మార్పులను విద్యార్థులకు వివరించారు.



ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ కె.ఎస్. రవికుమార్ విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడుతూ, ప్రస్తుత పోటీ ప్రపంచంలో చిన్న వయస్సు నుంచే శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని అలవర్చుకోవాలని, కొత్త విషయాలను తెలుసుకోవాలనే తపన పెంచుకోవాలని సూచించారు. పుస్తక జ్ఞానంతో పాటు ప్రయోగాత్మక అభ్యాసానికి ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా విద్యార్థుల్లో సంపూర్ణ పరిజ్ఞానం పెరుగుతుందని పేర్కొన్నారు. ఇంజినీరింగ్, ఐటీ రంగాల్లో సాంకేతికత వేగంగా మారుతున్న నేపథ్యంలో నూతన ఆవిష్కరణలపై ఆసక్తి, నైపుణ్యం పెంపొందించుకున్న వారికి భవిష్యత్తులో విస్తృత అవకాశాలు ఉంటాయని తెలిపారు. ప్రతి విద్యార్థి తనలోని ఆసక్తులు, సామర్థ్యాలను గుర్తించి క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర కృషితో ఉన్నత



లక్ష్యాలను సాధించాలని దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులతో పాటు జేపీఎన్‌సీఈ ఈఈఈ విభాగాధిపతి సిహెచ్. వెంకటేష్, అధ్యాపకులు రాజు, ప్రశాంత్, మెకానికల్ విభాగానికి చెందిన జావేద్ అలీ ఖాన్, ముస్తాక్ అలీ పాల్గొని విద్యార్థులకు వివిధ సాంకేతిక అంశాలను వివరించారు. కార్యక్రమ సమన్వయకర్తలుగా ఎం. సంపత్ పటేల్, ఎ. స్వాతి వ్యవహరించారు. పాఠశాల స్థాయిలోనే ఉన్నత విద్యా సంస్థల సాంకేతిక వాతావరణాన్ని పరిచయం చేయడం ద్వారా విద్యార్థుల్లో ఆలోచనా పరిధి విస్తరించడంతో పాటు భవిష్యత్తులో ఉన్నత విద్య, కెరీర్ ఎంపికపై స్పష్టత కలుగుతుందని నిర్వాహకులు అభిప్రాయపడ్డారు.

ప్రమాద బాధితుల ప్రాణరక్షణ..

ప్రమాదాల దర్యాప్తులో శాస్త్రీయ నైపుణ్యాలే కీలకం

- పోలీసులకు రెండు రోజుల ట్రామా లైఫ్ సపోర్ట్,

సైంటిఫిక్ క్రాష్ ఇన్వెస్టిగేషన్ శిక్షణ పూర్తి

- గోల్డెన్ అవర్‌లో ప్రథమ చికిత్సతో ప్రాణాలు కాపాడాలి.

. ప్రమాద స్థల ఆధారాలతో వాస్తవాలను వెలికితీయాలి : ఎస్పీ జానకి

మహబూబ్‌నగర్, నవంబర్ 20 (ప్రజా జ్యోతి బ్యూరో):

రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన బాధితుల ప్రాణాలను కాపాడటంతో పాటు, ప్రమాదాలకు గల అసలు కారణాలను శాస్త్రీయ ఆధారాలతో గుర్తించి బాధితులకు న్యాయం జరిగేలా చూడటంలో పోలీసులకు ప్రత్యేక శిక్షణ ఎంతో కీలకమని జిల్లా ఎస్పీ దరావత్ జానకి అన్నారు. ప్రమాదం జరిగిన తొలి గంటలో (గోల్డెన్ అవర్) సరైన ప్రథమ చికిత్స అందించడం ద్వారా అనేక ప్రాణాలను రక్షించవచ్చని పేర్కొన్నారు. రోడ్డు భద్రతలో భాగంగా సేవ్ లైఫ్ ఫౌండేషన్, ఢిల్లీ ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ జిల్లా పోలీసు అధికారులు, సిబ్బందికి నిర్వహించిన రెండు రోజుల ట్రామా లైఫ్ సపోర్ట్, సైంటిఫిక్ క్రాష్ ఇన్వెస్టిగేషన్ శిక్షణ కార్యక్రమం శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ముగిసింది. ముగింపు కార్యక్రమానికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ) చైర్‌పర్సన్ ఇందిర ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎస్పీ జానకి మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాల నివారణ, ప్రమాద సమయంలో బాధితులకు తక్షణ వైద్య సహాయం అందించడం, ప్రమాదానికి గల కారణాలను శాస్త్రీయంగా నిర్ధారించడం పోలీసుల విధుల్లో అత్యంత ముఖ్యమైన అంశాలని తెలిపారు. పోలీసు అధికారులు, సిబ్బందికి అత్యవసర వైద్య సహాయం, సీపీఆర్, రక్తస్రావ నియంత్రణ, ప్రమాద బాధితులను సురక్షితంగా తరలించే విధానాలతో పాటు ప్రమాదాల శాస్త్రీయ దర్యాప్తుపై అవగాహన పెంపొందించేందుకు సేవ్ లైఫ్ ఫౌండేషన్ సహకారంతో ఈ శిక్షణ నిర్వహించినట్లు వివరించారు.ప్రమాదం జరిగిన తొలి గంటలో బాధితులకు తగిన ప్రథమ చికిత్స అందిస్తే ప్రాణాపాయాన్ని తగ్గించవచ్చని, మరోవైపు ప్రమాద స్థలంలో లభించే ఆధారాలను శాస్త్రీయంగా పరిశీలించి, సేకరించడం ద్వారా ప్రమాదానికి గల వాస్తవ కారణాలను గుర్తించవచ్చని పేర్కొన్నారు.





రెండో రోజు.. ప్రమాదాల దర్యాప్తులో శాస్త్రీయ పద్ధతులపై శిక్షణ

రెండో రోజు సేవ్ లైఫ్ ఫౌండేషన్, పుణెకు చెందిన క్రాష్ ఇన్వెస్టిగేషన్ అండ్ ప్రివెన్షన్ విభాగం అసిస్టెంట్ మేనేజర్ విశాల్ వేకర్ పోలీసు అధికారులకు సైంటిఫిక్ క్రాష్ ఇన్వెస్టిగేషన్‌పై ప్రత్యేక శిక్షణ అందించారు. ప్రమాద స్థలాన్ని శాస్త్రీయంగా పరిశీలించడం, సంఘటనా స్థలాన్ని భద్రపరచడం, ప్రమాదానికి సంబంధించిన ఆధారాలను గుర్తించడం, వాటికి మార్కింగ్ చేయడం, ఫోటోగ్రఫీ ద్వారా సంఘటనను డాక్యుమెంట్ చేయడం వంటి అంశాలను వివరించారు. ప్రమాదానికి గురైన వాహనాలను పరిశీలించే విధానం, వాహనాల డ్యామేజ్ ఆధారంగా ప్రమాద తీవ్రతను అంచనా వేయడం, హీట్ డౌన్ మ్యాట్రిక్స్ పరిచయం, గత ప్రమాద కేసుల ఆధారంగా క్రాష్ రీకన్‌స్ట్రక్షన్ (ప్రమాద పునర్నిర్మాణం) విధానాలను ఉదాహరణలతో వివరించారు.ప్రమాద స్థలంలో లభించే చిన్న ఆధారం సైతం దర్యాప్తులో కీలకమవుతుందని, వాటిని సరైన విధంగా సేకరించి విశ్లేషించడం ద్వారా వాహనాల కదలికలు, ప్రమాదం జరిగిన పరిస్థితులు, అసలు కారణాలను స్పష్టంగా గుర్తించవచ్చని శిక్షణలో పేర్కొన్నారు.

శాస్త్రీయ ఆధారాలతోనే న్యాయస్థానాల్లో వాస్తవ నిర్ధారణ

ముగింపు కార్యక్రమానికి హాజరైన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ ఇందిర మాట్లాడుతూ, రోడ్డు ప్రమాద కేసుల్లో బాధితులకు న్యాయం జరిగేలా వాస్తవాలను శాస్త్రీయ ఆధారాలతో నిర్ధారించడం ఎంతో అవసరమని తెలిపారు. ప్రమాద స్థల పరిశీలనలో ప్రతి అంశాన్ని జాగ్రత్తగా నమోదు చేయాలని, ఆధారాలను సరైన విధానంలో సేకరించి భద్రపరచాలని సూచించారు. ప్రమాద స్థల ఫోటోగ్రఫీ, వాహనాల పరిశీలన, ఆధారాల గుర్తింపు, డాక్యుమెంటేషన్‌లో శాస్త్రీయ పద్ధతులను పాటించడం ద్వారా దర్యాప్తు నాణ్యత పెరుగుతుందని, న్యాయస్థానాల్లో వాస్తవాలను సమర్థవంతంగా నిరూపించేందుకు ఇవి ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. శిక్షణలో పొందిన నైపుణ్యాలను విధి నిర్వహణలో అమలు చేసి బాధితులకు న్యాయం జరిగేలా కృషి చేయాలని పోలీసులకు సూచించారు.

60 మంది పోలీసులకు ప్రత్యేక శిక్షణ

ఈ రెండు రోజుల శిక్షణలో మొత్తం 60 మంది పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. మొదటి రోజు ట్రామా లైఫ్ సపోర్ట్‌లో భాగంగా సీపీఆర్, ప్రథమ చికిత్స, రక్తస్రావ నియంత్రణ, ప్రమాద బాధితులను సురక్షితంగా తరలించే విధానాలపై ప్రాక్టికల్ శిక్షణ పొందారు. రెండో రోజు ప్రమాద స్థల పరిశీలన, ఆధారాల సేకరణ, వాహనాల తనిఖీ, ప్రమాద పునర్నిర్మాణం వంటి అంశాలపై శాస్త్రీయ శిక్షణ అందించారు.ఈ శిక్షణ విధి నిర్వహణలో మరింత సమర్థవంతంగా పనిచేసేందుకు ఎంతో ఉపయోగపడిందని పాల్గొన్న అధికారులు, సిబ్బంది అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో సేవ్ లైఫ్ ఫౌండేషన్ ఢిల్లీ అసిస్టెంట్ మేనేజర్ శివం, పుణె అసిస్టెంట్ మేనేజర్ విశాల్ వేకర్, ప్రాజెక్ట్ అసోసియేట్ ఐశ్వర్య పాటిల్, చెన్నై మేనేజర్ సంతోష్, డీఎస్పీలు రమణారెడ్డి, బాలాజీ, వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ అప్పయ్య, టూటౌన్ ఇన్‌స్పెక్టర్ యజాజుద్దీన్, రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గాంధీ నాయక్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ మితి రామ్, జడ్చర్ల టౌన్ ఇన్‌స్పెక్టర్ కమలాకర్, ఐటీ సెల్ ఎస్ఐ రవి, ఇతర పోలీసు ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లు, ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల సమస్యలను పరిష్కరించాలి

- నెలకు రూ.5 వేల గౌరవ వేతనం..
క్వింటాలుకు రూ.300 కమిషన్ పెంపునకు వినతి

మహబూబ్ నగర్ నవంబర్ 20 (ప్రజా జ్యోతి బ్యూరో):

తెలంగాణ రాష్ట్ర రేషన్ డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించి, తమకు ఆర్థిక భరోసా కల్పించాలని రేషన్ డీలర్ల ప్రతినిధులు కోరారు. ఈ మేరకు రాష్ట్ర సివిల్ సప్లై ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులను కలిసి తమ సమస్యలు, న్యాయమైన డిమాండ్లతో వినతిపత్రాలు అందజేశారు. రాష్ట్ర నూతన సివిల్ సప్లై కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన నాగిరెడ్డిని, సివిల్ సప్లై డిప్యూటీ కమిషనర్ మనోహర్ కుమార్ రాథోడ్‌ను రేషన్ డీలర్ల ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సత్కరించారు. అనంతరం రాష్ట్ర రేషన్ డీలర్ల గౌరవ అధ్యక్షుడు, పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డిని సైతం వేర్వేరుగా కలిసి డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు.ఈ సందర్భంగా రేషన్ డీలర్లకు నెలకు రూ.5 వేల గౌరవ వేతనం అందించాలని, క్వింటాలుకు రూ.300 కమిషన్ చెల్లించాలని ప్రధానంగా విజ్ఞప్తి చేశారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు, షాపుల నిర్వహణ ఖర్చులకు అనుగుణంగా ఆదాయం లేక డీలర్లు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రజలకు నిరంతరం రేషన్ సరుకులు పంపిణీ చేస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో అమలు చేస్తున్న డీలర్లకు తగిన గుర్తింపు, ఆర్థిక భరోసా కల్పించాలని కోరారు. అదేవిధంగా రేషన్ షాపుల ద్వారా మరిన్ని నిత్యావసర సరుకులు పంపిణీ చేసే అవకాశం కల్పించాలని, డీలర్ల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. రేషన్ డీలర్ల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి సానుకూల నిర్ణయం తీసుకునేలా కృషి చేయాలని అధికారులను, ప్రజాప్రతినిధులను కోరారు. మహబూబ్‌నగర్ జిల్లా రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎన్నం సత్యనారాయణ గుప్తా అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎండీ అన్వర్ పాషా, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శులు నాగరాజు, చెన్నారెడ్డి, మండలాల రేషన్ డీలర్లు నరేందర్ గౌడ్, శ్రీనివాస్, గుప్తా, మార్కండేయ గౌడ్, రామాచారి, తుల్జా నాయక్, శ్రీనివాసులు, కె. కృష్ణమూర్తి, ఎన్నం మాణిక్యం గుప్తా, సంజీవరెడ్డి, కె. శ్రీదేవి, పాండు తదితరులు పాల్గొన్నారు.



జూపల్లిలో ఆధ్యాత్మిక వేడుకకు
హాజరైన గోలి శ్రీనివాస్ రెడ్డి

శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ప్రాణప్రతిష్ఠలో ప్రత్యేక పూజలు

పలువివాహ వేడుకల్లో నూతన వధూవరులకు ఆశీర్వాదం

కల్వకుర్తి, నవంబర్ 20 (ప్రజా జ్యోతి)

నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండలం జూపల్లి గ్రామంలో నిర్వహించిన శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి విగ్రహ ప్రాణప్రతిష్ఠ మహోత్సవంలో తెలంగాణ రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం కల్వకుర్తి నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల్లో జరిగిన వివాహ శుభకార్యాలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, అష్టై శ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమాల్లో స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



